ఇల్లు.. ఇప్పట్లో కాదు..

- ముందుకు సాగని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- వ్యవసాయ సీజన్‌తో లబ్ధిదారుల వెనుకంజ
- వర్షాలతో కష్టంగా మారిన ఇసుక లభ్యత
- త్వరగా పూర్తి చేయాలంటున్న అధికారులు


నిర్మాణ పనులు ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచిస్తున్న అధికారులు (ఫైల్)

భద్రాచలంటౌన్: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. ఇళ్లు లేని పేదవారికి ఇంటిని నిర్మించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకం మొదటి విడతనే నత్త నడక సాగుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలకు మోసం చేసిందని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటిని నిర్మించి ఇస్తామని ప్రభుత్వ పెద్దలు హామీలు గుప్పించారు. కానీ, ఆ దిశగా పనులు జరగటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇళ్లు కట్టుకునేందుకు భూమి లేనివారికి సైతం తామే ఇంటి జాగా ఇచ్చి మరీ నిర్మిస్తామని మంత్రులు తెలిపారు. అయినప్పటికీ ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ఉండటంతో ఇంటిని నిర్మించేందుకు చాలామంది మొగ్గు చూపించడం లేదు. ప్రారంభించిన వారు సైతం నిర్మాణ పనులను ఆలస్యంగా చేస్తుండడంతో అధికారులు లబ్ధిదారులు ఇళ్ల చుట్టూ తిరుగుతూ పనులు వేగంగా చేపట్టాలని సూచిస్తున్నారు.

వ్యవసాయ సీజన్‌తో ఆటంకం

భద్రాచలం డివిజన్‌లో జూన్ నుంచి వ్యవసాయ సీజన్ మొదలవుతుంది. గ్రామాల్లోని ప్రజలు పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. ఇళ్ల నిర్మాణ పనులతో పాటు పలురకాల పనులను సైతం వాయిదా వేసి నవంబర్ నుంచి ప్రారంభిస్తారు. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కూడా లబ్ధిదారులు వాయిదా వేశారు. మరో పక్క వర్షాలు పడుతుండడంతో ఇంటి నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడుతోంది. దానికి తోడు ఇసుక దొరకడం కష్టంగా మారింది. సమీప గోదావరితో పాటు వాగులు వంకలు పొంగిపొర్లడంతో ఇసుక లభ్యం కాదు. ఇసుక నిల్వలు చేసిన కొందరు ఇష్టారీతిగా ధరలు పెంచి అమ్ముతున్నారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

అధికారుల ఒత్తిడి..

ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. నిర్మాణ పనులు ప్రారంభించకపోతే జాబితా నుంచి తొలగిస్తామని కొన్ని చోట్ల బెదిరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ లెక్కల ప్రకారం మొదటి విడత ఇళ్ల నిర్మాణ లక్ష్యం విజయవంతంగా పూర్తి చేసి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులపై ప్రభుత్వం భారం పెట్టింది. దీంతో వారు లబ్ధిదారులపై ఒత్తిడి చేయక తప్పడం లేదు. ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించిన ప్రతి లబ్ధిదారుడి మొదటి విడత నగదును ఖాతాల్లో జమ చేశారు. ఇలాగైన మిగతా వారు పనులను ప్రారంభిస్తారని అధికారులు ఆశించినా.. ఫలితం మాత్రం నామమాత్రమే.

ఇందిరమ్మ ఇళ్ల లెక్క ఇలా..

భద్రాచలం డివిజన్‌లో సుమారు 2,227 ఇళ్ల మంజూరు పత్రాలను అధికారులకు లబ్ధిదారులకు అందజేయగా అందులో మార్కింగ్ చేసినవి 432, బేస్ మెంటల్ లెవెల్ 142, రూఫ్ లెవెల్ 4 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటికీ ఒక్క ఇళ్లు కూడా పూర్తికాలేదు. మండలాల వారిగా భద్రాచలం మొత్తం ఇళ్లు 303, బేస్‌మెంట్ లెవెల్ 68, రూఫ్ లెవెల్ 26, మార్కింగ్ చేసినవి 40 ఉన్నాయి. చర్లలో మొత్తం ఇళ్లు 848, మార్కింగ్ ఇచ్చినవి 83, బేస్‌మెంట్ లెవెల్ 33, రూఫ్ లెవెల్ 4.. దుమ్ముగూడెం మొత్తం 1,076, మార్కింగ్ 215, బేస్‌మెంట్ లెవెల్ 10, రూఫ్ లెవెల్ లేవు.

ఎటువంటి గడువు లేదు..



ఇళ్ల మంజూరు పత్రాలు తీసుకున్న లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎలాంటి గడువు లేదు. కానీ, పనులు త్వరగతిన ప్రారంభించి ఇంటి నిర్మాణం పూర్తి చేయాలి. ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులు అందుబాటులో ఉంటారు. దళారులను నమ్మి మోసపోవద్దు.

–బొగ్గా నారాయణ, ఎంపీడీఓ, భద్రాచలం

క్లుప్తంగా

వరదలపై అప్రమత్తత అవసరం

మణుగూరురూరల్: గోదావరి వరదల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు సూచించారు. గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. పునరావాస కేంద్రాలను, అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని, బాధితులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వరద పెరిగితే ప్రజలు సమీపంలోని అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. మణుగూరు సీఐ పాటి నాగబాబు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

దమ్మపేట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ప్రత్యేక సర్వేపై మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ సర్వేలో పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి, ఎన్నికల డీటీ హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం మండల పరిధిలోని ఓటర్ పోలింగ్ స్టేషన్ బూత్ లెవెల్ అధికారులకు మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆర్డీఓ దామోదర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని బూత్ లెవెల్ అధికారులంతా ఉదయం డిగ్రీ కళాశాలకు రావాలని పేర్కొన్నారు.

నోటు పుస్తకాల వితరణ

దమ్మపేట: మండలంలోని దమ్మపేట, నెమలిపేట, బంజారాకాలనీ, కొత్తపేట, అర్బన్‌కాలనీ, మల్లారం, నల్లకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 240 మంది విద్యార్థులకు, దమ్మపేటకు చెందిన మనవేదిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఈ సంఘం సలహాదారులు పానుగంటి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే విద్యార్థుల భవితకు పునాదులు పడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పార్వతి, సుజిత, తస్లీమా, మస్తాన్, వీరమ్మ, ఉపాధ్యాయులు, సంఘం సభ్యులు కొప్పుల వెంకటరమణ, మహలక్ష్మి, ప్రశాంత్, లక్ష్మణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్, ఎర్రగుంటలోని ప్రాథమిక పాఠశాలల్లో ఇంపాక్ట్, తొలిఅడుగు ఫౌండేషన్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా బాలికలకు జీవన విధానంపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిశుభ్రత పాటించాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, ట్రైనర్లు నాగమణి, సౌజన్య, లావణ్య, గోపాలకృష్ణ, శేఖర్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐ టెక్నాలజీతో మెరుగైన బోధన

అశ్వారావుపేటరూరల్: ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ టూల్స్ (ఏఐ) టెక్నాలజీతో విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని కాంప్లెక్స్ హెచ్‌ఎం పరుచూరి హరిత్ అన్నారు. సోమవారం ఆమె కాంప్లెక్స్ పరిధిలోని చిన్నంశెట్టిబజార్, పాపిడిగూడెం ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. పాపిడిగూడెం పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఏఐ టెక్నాలజీతో బోధన చేస్తుండగా, ఆమె పరిశీలించి సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలు, రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలోని అబ్బుగూడెం, కట్టుగూడెం గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖాధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్‌కు పురస్కారం

ములకలపల్లి: మండలంలోని జగన్నాథపురానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్ ఎండీ ఉస్మాన్‌ఖాన్‌కు ప్రతిష్టాత్మక 'గిడుగు వెంకటరామ్మూర్తి' జీవన సాఫల్య పురస్కారం దక్కింది. తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న వెంకటరామ్మూర్తి పేరిట అందజేస్తున్న ఈ అవార్డును.. తెలుగు, ఉర్దూ భాషల్లో అనేక సామాజిక సమస్యలపై రచనలు చేసిన ఉస్మాన్‌ఖాన్‌కు అందించారు. ఈ నెల 20న హిందూపురంలో నిర్వహించనున్న కార్యక్రమంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ వి.గోపాలగౌడ చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నారు.

బస్టాండ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న స్థానికులు

దమ్మపేట: దమ్మపేట బస్టాండ్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం దమ్మపేట బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో చేపట్టిన పెట్రోల్ బంక్ నిర్మాణం, బస్సుల రాకపోకలకు అడ్డుగా ఉందని, బంక్ నిర్మాణాన్ని మరోచోటకు మార్చాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా మార్గం ఏర్పాటు చేయిస్తానని, ప్రస్తుతం సత్తుపల్లి నుంచి అశ్వారావుపేటకు వెళ్లే బస్సులను దమ్మపేటకు వచ్చేలా చేస్తానని, ఏడాదిలోగా బస్టాండ్‌ను పూర్తిగా ఆధునికీకరిస్తామని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ నాయకుడు అత్యం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం దమ్మపేటలో మూడు పెట్రోల్ బంక్‌లు ఉండగా కొత్తగా బస్టాండ్‌లో బంక్ మండల ప్రజలకు అవసరం లేదని స్పష్టం చేశారు. బంక్ నిర్మాణం ఆలోచనను విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సున్నం శ్రీను, వలీ, గోపి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


మణుగూరుటౌన్: సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్/అశ్వాపురం: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఐటీసీ అందించిన 47 సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఐటీసీ యాజమాన్యం ఒక్క మండలానికే పరిమితం కాకుండా నియోజకవర్గంలోని విద్యార్థులకు 300 సైకిళ్లను అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వర్ణజ్యోతి, హెచ్‌ఎం నాగశ్రీ, తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఐటీసీ సీఓ చంగళరావు, రామానుజవరం హెచ్‌ఎం యశోద, నవీన్, శివసైదులు, తరుణ్‌రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే, అశ్వాపురంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు 70 మందికి ఐటీసీ అందించిన సైకిళ్లను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంఈఓ వీరస్వామి, ఎంపీఓ ముత్యాలరావు, ఎఫ్‌ఆర్‌ఓ రమేశ్, యోగితావేణి పాల్గొన్నారు.

మరమ్మతులు చేయించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

చర్ల: చర్ల నుంచి దోశిళ్లపల్లి మీదుగా తాలిపేరు ప్రాజెక్టు వరకు అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించాలని పెదమిడిసిలేరుకు చెందిన గిరిజనులు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు విన్నవించారు. తాలిపేరు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యేను ప్రాజెక్టు వద్ద కలిగిన గిరిజనులు దోశిళ్లపల్లి శివారు నుంచి తాలిపేరు ప్రాజెక్టు వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని, ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్న ఆటోలు, ద్విచక్రవాహనాదారులు, ట్రాక్టర్లు ప్రమాదాల బారిన పడుతున్నాయని తెలిపారు. కాగా, రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తా..

దుమ్ముగూడెం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని కమలాపురం, ఎర్రబోరు గ్రామాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మొదటి విడత బిల్లులు పడలేదని ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే బిల్లులు చెల్లించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, లంకా శ్రీనివాసరావు, అన్నెం సత్యనారాయణమూర్తి, తోట రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరానికి విశేష స్పందన


భద్రాచలంటౌన్: ఆధార్ నమోదు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ దామోదర్‌రావు

భద్రాచలంటౌన్: భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఆధార్ కార్డు సవరణ క్యాంపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు అన్నారు. భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఆధార్ శిబిరాన్ని ఆర్డీఓ దామోదర్‌రావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భద్రాచలం డీటీ డానియల్ వెంకటేశ్వరరావు, చర్ల డీటీ రాజు, నాలుగు మండలాల ఆర్‌ఐలు పాల్గొన్నారు.

నేటి నుంచి మెగా ఆధార్ క్యాంపు

దమ్మపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు మెగా ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, ముల్కలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల పరిధిలోని ప్రజలు.. ఆధార్‌లో సవరణలు, నూతన ఆధార్‌కార్డు కోసం సంప్రదించవచ్చని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు కార్యకలాపాలు కొనసాగుతాయని వివరించారు.

సద్వినియోగం చేసుకోండి..

మణుగూరురూరల్: మండలంలోని వాసవినగర్ గిరిజనభవన్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్ సేవలను మణుగూరు సబ్ డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వారు మాట్లాడారు. సంబంధిత ధ్రువపత్రాలతో క్యాంప్‌నకు వచ్చి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేగాకు సండ్ర పరామర్శ


రేగాతో మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

కరకగూడెం: ఇటీవల తన తల్లి మరణించగా మండలంలోని కుర్నవెల్లిలోని నివాసంలో ఉంటున్న పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును సోమవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో పగడాల సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'తురకకాశ' కమిటీ ఎన్నిక

చంద్రుగొండ: తురకకాశ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన సయ్యద్ బాదుషా నియమితుడయ్యారు. తుర్క కాశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బడేసాహెబ్ చేతుల మీదుగా సోమవారం హైదరాబాద్‌లో నియమక పత్రాన్ని బాదుషా తీసుకున్నారు.

పెనాల్టీ విధించొద్దు..

మణుగూరుటౌన్: జూలై 9న సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులకు పెనాల్టీ యోచన విరమించుకోవాలని ఇఫ్టూ, హెచ్‌ఎంఎస్ నాయకులు సోమవారం డీజీఎం(పర్సనల్) రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇఫ్టూ నాయకుడు నాజర్‌పాషా, హెచ్‌ఎంఎస్ కార్యదర్శి కోడిపెల్లి శ్రీలత మాట్లాడారు. కార్యక్రమంలో మంగీలాల్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు


ప్రజలను పరీక్షిస్తున్న డాక్టర్ రాందాస్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలోని మొద్దులమడ, దురదపాడులో సోమవారం వైద్యశిబిరాలను నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే చేశారు. ఆ తర్వాత ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దమ్మపేట మాత శిశు సంరక్షణ బృందం ఆధ్వర్యంలో తల్లులు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమాల్లో డీపీఎంఓ మోహన్, సిబ్బంది విజయ్‌రెడ్డి, సత్యనారాయణ, ఏఎన్‌ఎం చెల్లమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడీ బండ్లకు లోడింగ్ ఇవ్వాలి

మణుగూరుటౌన్: బొగ్గు బాడీ బండ్లకు క్వాలిటీ బొగ్గు లోడింగ్ ఇవ్వాలని, క్వాలిటీ లేక వచ్చిన పరిమిట్లు వెనక్కి వెళ్లిపోతున్నాయని సీపీఐ నాయకులు తెలిపారు. సోమవారం సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మిడిదొడ్ల నాగేశ్వరావు విలేకరులతో మాట్లాడారు. సింగరేణి సంస్థ రెండు నెలలుగా బాడీ బండ్లకు లోడింగ్ ఇవ్వకపోవడంతో యజమానులు ఫైనాన్సులు, టాక్స్‌లు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్వాలిటీ బొగ్గును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, బాల సత్యనారాయణ, మేరెడ్డి సురేందర్‌రెడ్డి, అడపా స్వామి, తూపూడి గోవింద్, పెన్నపురెడ్డి జయపాల్‌రెడ్డి, కుమ్మరకుంట్ల వెంకటస్వాములు, జుమ్మారి వెంకన బాబు, భాస్కర్, శ్రీనివాస్, గౌస్, ఉప్పలయ్య, రమేశ్ తదితరులు ఉన్నారు.

బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలి


మాట్లాడుతున్న హరిలాల్‌నాయక్

గుండాల: రాష్ట్ర ప్రభుత్వం బదిలీలతో కూడిన పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆళ్లపల్లి మండలంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపెయిన్లో భాగంగా వివిధ పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు ఇవ్వాలని, కేజీబీవీల్లో పనిచేస్తున్న సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఇచ్చి రెగ్యులర్ చేయాలని, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగా రాంబాబు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు వీరన్న, సోమ్లా, భావ్‌సింగ్, నెహ్రూ, రవి, సాంబశివరావు, రామయ్య, శ్రీను, కుమార్ రాజా, రమేశ్, చిన్న పాల్గొన్నారు.

పెంచిన స్కూల్ ఫీజులు తగ్గించాలి


వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ అనుబంధ భద్రాచలం పబ్లిక్ స్కూల్‌లో పెంచిన ఫీజులు తగ్గించాలని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఐటీసీ యాజమాన్యానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కార్మిక కుటుంబాల సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్కూల్‌ను కూడా గుర్తింపు కార్మిక సంఘం, యాజమాన్యం కార్పొరేట్ విద్యాసంస్థగా మారుస్తున్నాయన్నారు. 13వ వేతన ఒప్పందంలో రాసుకున్న డిమాండ్లు వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం యాజమాన్య ప్రతినిధికి వినతిపత్రం అందించారు.

తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నిక


తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల కమిటీని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సోమవారం ములకపాడు గ్రామంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడిగా పర్షిక గోపాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లబోయిన లక్ష్మణ్, చర్ల, వెంకటాపురం మండల అధ్యక్షులు సోడి అనిల్‌కుమార్, తూర్స చంటి, తాటి లక్ష్మణ్, సోడి శ్రీను, వర్స ముద్ద రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ దారిలో ప్రయాణం నరకమే..

- మితిమీరిన వేగంతో వెళ్తున్న లారీలు
- అడుగడుగునా ఏర్పడిన గుంతలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వేడుకోలు


మణుగూరు - బీటీపీఎస్ రహదారి


గుంతల రోడ్డులో వెళ్తున్న వాహనం

మణుగూరురూరల్: ఎవరైనా గమ్యస్థానం చేరాలన్నా.. సురక్షితంగా ప్రయాణం కొనసాగించాలన్నా.. వెళ్లే మార్గం సజావుగా ఉండాలి. మణుగూరు ప్రాంతం పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్నా ట్రాఫిక్ నియంత్రణలో, ప్రమాదాలను అరికట్టడంలో వెనుకంజలోనే ఉంటుందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తూనే ఉంటున్నాయి. ప్రధానంగా మణుగూరు – ఏటూరునాగారం ప్రధాన రహదారి బీటీపీఎస్ వద్ద అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇది అసలు రహదారేనా అంటూ అంటూ ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మణుగూరు శివారున భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మితమవడంతో బొగ్గు రవాణా చేసే లారీలు, టిప్పర్లు, మెటీరియల్ తీసుకువచ్చే భారీ వాహనాలతో పాటు ఏటూరునాగారం వైపు ప్రయాణించే వాహనాల రాకపోకలతో ఈ రహదారి రద్దీగానే ఉంటుంది. రద్దీతో పాటు ట్రాఫిక్, దుమ్ము, ధూళి సమస్యలు కూడా ఎక్కువనే చెప్పవచ్చు. ఈ మార్గం గుండా ప్రయాణించాలంటే చిన్న వాహనదారులకు పెద్ద సాహసమే. ఒక వైపు భారీ వాహనాల రాకపోకలు, మితిమీరిన వేగం, మరో పక్క దుమ్ము ధూళితో ద్విచక్ర, త్రిచక్ర, కారు వంటి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి సాంబాయిగూడెం ప్రాంతంలో ఇసుక ర్యాంప్ నిర్వహణ జరుగుతుండడంతో ఇసుక లారీల నిలుపుదలతో ఉన్న కాస్త రహదారి ఆక్రమణకు గురవుతోంది. వచ్చిపోయే వాహనాలకు ఆటంకంగా మారుతున్నాయి. దీంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. బీటీపీఎస్ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ, లారీల వంటి భారీ వాహనాల నిలుపుదలపై ఇప్పటికే పోలీస్ అధికారులు అనేక మార్లు సమావేశాలు నిర్వహించి సూచించినా, హెచ్చరికలు చేసినా.. ఇవేమీ తమకు వర్తించవన్నట్లుగా బొగ్గు, లారీ డ్రైవర్లు వ్యవహరిస్తున్నారు. బాధ్యతాయుతమైన పని చేస్తూ కూడా ఇతరుల ప్రాణాలను లెక్కచేయకుండా కొందరు డ్రైవర్లు లారీలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఏదైనా ప్రమాదం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నప్పుడు పోలీస్ శాఖ గట్టి చర్యలు చేపడుతున్నప్పటికీ.. కొన్ని రోజులు గడిచాక మళ్లీ యథావిధిగానే డ్రైవర్లు లారీలను మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా నడుపుతున్నారు. ఈ వేగానికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. మరికొంతమంది రహదారి పక్కనే నివాసాలు ఏర్పర్చుకోవడంతో ఎగిసి పడే దుమ్ము, ధూళికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో కలుగుతున్న ఇబ్బందులపై గ్రామస్తులు అనేకమార్లు అధికారులకు విన్నవించుకున్నా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడంలో విఫలం చెందుతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీస్ అధికారులు, బీటీపీఎస్ యాజమాన్యం ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు, వాహనదారులు వేడుకుంటున్నారు.